
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.5
కనిష్ఠం 24.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 14 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	68,210	61,965
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.85 (4.16)	1,352	483.3
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.89 (42.57)	31,834	33,295

చికెన్ ధరలు	లైవ్ : రూ.130	డ్రెస్ : రూ.190	స్కిన్‌లెస్ : రూ.216



గెలుపొందిన డైరెక్టర్లతో అయిలయ్య

మదర్ డెయిరీ కాంగ్రెస్ చేతికి

నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్ముల్) ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ చేతిలో ఉన్న మదర్ డెయిరీ అత్యధిక డైరెక్టర్ల పదవులు గెలుచుకున్న కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లింది.
- నల్లగొండ, తుర్కపల్లి

- ఆరుగురు డైరెక్టర్ల గెలుపు
- నేడు డెయిరీ చైర్మన్ ఎన్నిక
- మధుసూధన్‌రెడ్డి ఏకగ్రీవం లాంఛనమే
- ఫలించిన మంత్రి కోమటిరెడ్డి వ్యూహం

హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌లో శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మదర్ డెయిరీ ఆరు డైరెక్టర్ల పదవులకు పోలింగ్ నిర్వహించారు. ఉమ్మ డి నల్లగొండజిల్లాలోని నాలుగు డైరెక్టర్ స్థానాలకు మొత్తం ఎనిమిది మంది పోటీపడగా, కాంగ్రెస్ తరఫున నలుగురు, బీఆర్ఎస్ నుంచి నలుగురు పోటీచేశారు. రంగారెడ్డి జిల్లా లో రెండు సీట్లకు నలుగురు పోటీచేశారు. మొత్తం 297 మంది పాలసొసైటీ ఛైర్మన్లు ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ అనంతరం జరిగిన ఓట్లలెక్కింపులో ఆలేరు ఎమ్మె ల్యే బీర్ల అయిలయ్య మద్దతు తెలిపిన ఆలేరు నియోజక వర్గానికి చెందిన నలుగురు డైరెక్టర్లు, రంగారెడ్డి జిల్లాలో ఇద్దరు డైరెక్టర్లు గెలిచారు. ఎమ్మెల్యే అయిలయ్య ప్రతిపాదించిన డెయిరీ ఛైర్మన్ అభ్యర్థి గుడిపాటి మధుసూధన్ రెడ్డికి 229 ఓట్లు పోల్ కాగా, కాంగ్రెస్ ప్యానల్‌కు చెందిన కల్లెపల్లి శ్రీశైలం 222 ఓట్లు, పుప్పాల నర్సింహులు 181, బత్తుల నరేందర్‌రెడ్డి 177, అగ్రాల నర్సింహారెడ్డి 242, మం డలి జంగయ్యకు 232 ఓట్లు పోలవడంతోపాటు విజయం సాధించారు. బీఆర్ఎస్ ప్యానెల్ నుంచి ఒగ్గు భిక్షపతి, డి. సోమిరెడ్డి, ఎస్.భాస్కర్, ఎం.కొండల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా నుంచి వగడాల గణేశ్, ఎడ్ల రాంరెడ్డి పోటీచేశారు. మొత్తం 15మంది డైరెక్టర్లకు గతంలో 9మంది డైరెక్టర్లు పదవిలో ఉండగా ముగ్గురు మాత్రమే కాంగ్రెస్ ప్యానల్‌కు చెందిన వారు ఉన్నారు. ప్రస్తుతం ఆరుగురు గెలుపొందడంతో కాంగ్రెస్ బలం తొమ్మిదికి పెరిగింది. బీఆర్ఎస్ డైరెక్టర్లు ఆరుగురు ఉన్నారు. మెజార్టీ డైరెక్టర్లు కాంగ్రెస్‌కు ఉన్నందున ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. శనివారం హయాత్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో ఎన్నికల అధికారి సమక్షంలో గెలిచిన ఆరుగురు డైరెక్టర్ల పదవీకాలానికి డ్రా తీయనున్నారు.దీంట్లో ముగ్గురికి నాలుగేళ్లు,మరో ముగ్గురు ఐదేళ్లు పదవిలో కొనసాగుతారు.ఆతర్వాత ఛైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు.

ఫలించిన మంత్రి కోమటిరెడ్డి వ్యూహం

మదర్ డెయిరీ ఎన్నికల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రచించిన వ్యూహం ఫలించింది. ఇప్పటి వరకు డెయిరీ పగ్గాలు అటు గుత్తా ఫ్యామిలీ, ఇటు గొంగిడి మహేందర్ రెడ్డి వర్గం చేతిలో కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గం డైరెక్టర్ పదవులు దక్కించుకొని డెయిరీలోకి అడుగుపెట్టినట్లయింది. ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ మూడు రోజుల పాటు క్యాంపు రాజకీయం నడిపింది. ఈ సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల సంఘాల ఛైర్మన్లతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూ పర్యవేక్షించారు. దీంతోపాటు పోలింగ్ చివరి రోజున మాజీ ఛైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డికి ఎన్నికల బాధ్యతలు అప్పగించడంతో ఆయన వర్గానికి చెందిన 60 మంది ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. ఇది కాంగ్రెస్‌కు కలిసివచ్చింది.

క్యాంపు నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికే

మదర్ డెయిరీలో ఖాళీ అయిన ఆరు స్థానాలను గెలిపించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. గత దశాబ్దకాలంగా మదర్ డెయిరీ ఛైర్మన్ బీఆర్ఎస్ ఖాతాలోనే ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. రెండు పార్టీల నాయకులు వారి సానుభూతిపరులను గెలిపించుకోవడానికి వారం రోజులుగా క్యాంపులు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎలాగైనా ఆరు డైరెక్టర్ స్థానాలను గెలవాలని ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. చివరికి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సానుభూతి పరులైన ఆరుగురిని గెలిపించుకుని సత్తా చాటారు. సాధారణ ఎన్నికల మాదిరిగా పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. క్యాంపుల నుంచి పాల సంఘాల ఛైర్మన్‌లు నేరుగా పోలింగ్ కేంద్రానికే చేరుకున్నారు. బీర్ల అయిలయ్య వేగంగా పావులు కదపడంతో ఆరు డైరెక్టర్ స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి.

నేడు ఛైర్మన్ ఎన్నిక



మదర్ డెయిరీ ఛైర్మన్ ఎన్నికను శనివారం ఉదయం 11గంటలకు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి తెలిపారు. కాంగ్రెస్ పెద్దల సూచన మేరకే ఆ పార్టీకి చెందిన 9మంది డైరెక్టర్లలో గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నట్టు సమాచారం.

ఆలేరులో బీర్ల పైచేయి

మదర్ డెయిరీ ఎన్నికల్లో గెలుపుతో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆలేరు నియోజకవర్గంలో పైచేయి సాధించినట్టయింది. మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత భర్త, డీసీసీబీ మాజీ ఛైర్మన్ మహేందర్ రెడ్డి ప్యానల్ ఓడిపోవడం బీఆర్ఎస్‌కు గట్టిషాక్ తగిలినట్టయింది. పాలకవర్గంలో ఆరుగురు డైరెక్టర్లు బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉండటం కొంత ఉపశమనం కలిగించింది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టేందుకు ఈ ఎన్నికల్లో పోటాపోటీగా ఖర్చు చేసినట్టు వినికిడి. ఓటర్లకు కాంగ్రెస్ రూ.45వేల నగదు, రూ.5వేల విలువైన వెండి వస్తువులు పంపిణీ చేసినట్టు ప్రచారంలో ఉంది. ఇక ఓటర్లకు బీఆర్ఎస్ రూ.15వేల వరకు పంపిణీ చేసినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, పార్టీ అభ్యర్థులను గెలిపించినందుకు పాల ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్లకు బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు తెలిపారు.

• ఇష్ట నైవేద్యం సమర్పయామి



నల్లగొండ తిరుమలనగర్ ట్యాంక్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుడికి ఆ కాలనీ వాసులు ఇంటికి ఒకరు చొప్పున ఇష్ట నైవేద్యాన్ని సమర్పించారు. పలు రకాల ఆహార పదార్థాలను సమర్పించి భక్తులకు వితరణ చేశారు.

వందేభారత్‌కు మిర్యాలగూడ
హాల్ట్ కొనసాగింపు
● నేటి నుంచి అమల్లోకి: దక్షిణమధ్యరైల్వే
•7లో..

నలుగురి ప్రాణాలు తీసిన
అతివేగం
ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి
•7లో..

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 13: విద్యార్థుల్లో అభ్యసనాసక్తి పెరిగేలా ఉపాధ్యాయులు ఉత్తమ బోధన చేసి ఉత్తమ ఫలితాలను సాధించేలా చూడాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. జిల్లాలోని ఆదర్శ పాఠశాలగా ఎంపికైన నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. పదో తరగతిలో 10 జీపీఏ వచ్చేలా విద్యాబోధనను మెరుగుపర్చాలని ప్రధానోపాధ్యాయుడు నరేశ్‌కు సూచించారు. అనంతరం విద్యార్థుల అభ్యసనాసక్తిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచనలు చేశారు. పాఠశాలకు సరఫరా అవుతున్న బియ్యం నాణ్యత, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపట్టిన పనుల పురోగతిని డీఈవో పరిశీలించారు.

కట్టంగూరు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు పేరు ప్రతిష్ఠలు తేవాలని డీఈవో భిక్షపతి అన్నారు. కట్టంగూరులోని కేజీబీవీ పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్లబ్‌లో విజేతలకు బహుమతిని అందజేశారు. పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి, మరికొన్ని మరమ్మతులు చేయించుకోవాల్సింది గా సూచించారు. ఆయన వెంట ఎస్‌వో నీలాంబరి, తదితరులు ఉన్నారు.



బీ.వెల్లెంల జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేస్తున్న డీఈవో

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎఫ్ నాయకులు

మిర్యాలగూడ, సెప్టెంబరు 13: రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి రైతులకు కనీస మద్దతు ధర అందించాలని, ఢిల్లీలో పోరాటం సందర్భంగా రైతులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోతుగంటి కాశీ, సైదమ్మ, భరత్, కిరణ్, జ్యోతి, హరీష్, లింగమ్మ, ఎల్లమ్మ, సందీప్, చందు, ప్రశాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర మరమ్మతులు పూర్తి చేయాలి



పుట్టంగండిలో మరమ్మతులకు గురైన యూనిట్-1ను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 13: పుట్టంగండిలో అత్యవసర మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ సీఈ వి.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పుట్టంగండిలో మరమ్మతులకు గురైన యూనిట్-1ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అక్కంపల్లి రిజర్వాయర్ నీటిమట్టం గణనీయంగా తగ్గడం తో తాగు, సాగు అవసరాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పుట్టంగండిలో యూనిట్-1లో త్వరగా మరమ్మతులు పూర్తిచేసి నాలుగు మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేయాలన్నారు. ఈ మరమ్మతులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే మరమ్మతులు ఈ నెల 18వ తేదీ వరకు పూర్తికావొచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ నాగయ్య, ఏఈఈ శిల్ప, తదితరులు ఉన్నారు.

ఉత్తమ్ కమిటీని ఉపసంహరించుకోవాలి

మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ సైదులు

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 13: ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జడ్పీ విశ్రాంతి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ అమలుకు మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఖండిస్తోందన్నారు. తమ అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటీ వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. మంత్రుల కమిటీతో మాల, మాల ఉపకులాలకు ఏమాత్రం న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారని, మంత్రుల కమిటీలోనే తమకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కమిటీని స్వాగతించే ప్రసక్తే లేదన్నారు. వర్గీకరణ కోసం ప్రభుత్వ డబ్బు వెచ్చించి, దగ్గరుండి కథ నడిపించిన దామోదర రాజనర్సింహ ఈ కమిటీలో ఉండగా, తమకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ఈ కమిటీని రద్దు చేసి సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మొండిగా నిర్ణయాలు తీసుకుంటే గతంలో చంద్రబాబుకు పట్టిన గతే ఆయనకూ తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తెలగమల్ల యాదగిరి, సీనియర్ నాయకులు తల్లమల్ల యాదగిరి, గండమల్ల విఘ్నేష్, తెలగమల్ల రవీందర్, గండమల్ల శీను, మాదరి మధు, ఎన్నమల్ల పురుషోత్తం, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోలి సైదులు



ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

● కేజీబీవీ సిబ్బంది వేధింపులే కారణమా? ● సూర్యాపేట జిల్లా మద్దిరాలలో ఘటన ● గోప్యంగా ఉంచిన సిబ్బంది



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీతిక

సూర్యాపేటక్రైం, మద్దిరాల, సెప్టెంబరు 13: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ బాలికను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా, ఈ విషయాన్ని పాఠశాల సిబ్బంది గోప్యంగా ఉంచారు. సేకరించిన వివరాలు, బంధువుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన గీతిక మద్దిరాలలోని కేజీబీవీలో ఆరో తరగతి చదువుతోంది. అక్కడి సిబ్బంది పలుమార్లు బాలికతో దురుసుగా మాట్లాడటంతో ఇదే విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. కొద్ది రోజులుగా మనస్తాపంగా ఉంటున్న బాలిక శుక్రవారం ఉదయం పాఠశాల భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో గీతిక నడుం భాగానికి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలికను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో బాలికకు వైద్యం అందుతున్న తీరును జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఘటనపై పూర్తి విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీరయ్య తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి : మాతృనాయక్



రోగులతో మాట్లాడుతున్న మాతృనాయక్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 3: సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో అన్ని వార్డుల్లో తిరిగి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థుల ఎంపిక

గట్టుప్పల్, సెప్టెంబరు 13: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని వెల్మకన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శివసాయి విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సుభాష్ చందర్, పీడీ కొండ పరమేశం తెలిపారు. ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులు కాంక్షించారు.

కట్టంగూరు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని చెరువు అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తీగల సాయివర్షణ్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందాల రమ, పీఈటీ చింతకాయల పుల్లయ్య తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు వరంగల్‌లోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే 38వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో నల్లగొండ జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన లెంకల జగత్ విఖ్యాత్‌రెడ్డి రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వట్టిమర్తికి చెందిన లెంకల ప్రవీణ్ రెడ్డి కుమారుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి ఈ నెల 8న భువనగిరిలో జరిగిన నల్లగొండ జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభతో ఒక బంగారు పతకం, రెండు కాంస్య పతకాలను సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.

ప్రిన్సిపాల్‌కు ప్రశంసాపత్రం

చండూరు: చండూరు కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 2023-24 సంవత్సరానికి 100శాతం ఉత్తీర్ణత సాధించినందుకు తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం నుంచి ప్రిన్సిపల్ మంజుల ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 కేజీబీవీ కళాశాలల్లో ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత ఫలితాలుండగా, అందులో చండూరు కేజీబీవీ జూనియర్ కళాశాల ఒకటిగా నిలిచింది.



















ఉద్యోగ భద్రత కల్పించారు

● మిర్యాలగూడతో ఏచూరికి అనుబంధం



మిర్యాలగూడ సభలో నవ్వులు పూయిస్తూ.. ఏచూరి(ఫైల్)

మిర్యాలగూడ, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా మిర్యాలగూడతో సీతారాం ఏచూరికి ప్రత్యేక అనుబంధం ఉంది. జాతీయ కార్యదర్శి హోదాలో అనేక సార్లు మిర్యాలగూడకు వచ్చారు. డిసెంబర్ 1, 2003లో పార్టీ డివిజన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. 2004 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకూ సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపు కోరుతూ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. 2017లో టీమాస్ సభలకు హాజరయ్యారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా 2023 సెప్టెంబరు 17న ఎన్నెస్పీ క్యాంపు గ్రంథాలయం వద్ద జరిగిన బహిరంగసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిర్యాలగూడ ఎఫ్‌సీఐ హమాలీ కార్మికుల కోసం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి.. సీతారాం ఏచూరితో కలిసి పలు మార్లు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించినట్లు కార్మిక సంఘం సీఐటీయూ నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన కార్యకర్తలు, ప్రజలను పలకరించిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. ఆయనతో దిగిన ఫొటోలను తమ ఫోన్లలో స్టేటస్‌లుగా పెట్టుకుని ఆయనకు కన్నీటి నివాళి అర్పిస్తున్నారు.

కమీషన్ ఇస్తేనే కొటేషన్

● జీఎస్టీ వ్యాపారులకు కలిసివస్తున్న పీఎం విశ్వకర్మ పథకం ● లక్ష కొటేషన్ బిల్లుకు రూ.3వేలు కమీషన్



రామగిరి, సెప్టెంబరు 13: చేతివృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో 14 కులాలకు సంబంధించిన చేతివృత్తిదారులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆధునిక పరికరాల కొనుగోలుకోసం రూ.లక్ష అందిస్తుంది. అంతేకాకుండా శిక్షణ కాలంలో వారం రోజులకు రూ.4వేలు కూడా ఇస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పథకం. అయితే ఇంత వరకూ బాగానే ఉన్నా పీఎం విశ్వకర్మ పథకానికి జిల్లాలో వేలసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. వారికి నల్లగొండ, మిర్యాలగూడ వంటి ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత శిక్షణ సర్టిఫికెట్, ఆధార్, పాన్‌కార్డుల ఆధారంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ బ్యాంకర్లు జీఎస్టీ కొటేషన్ బిల్లు ఉంటేనే రుణం మంజూరు చేస్తామని తేల్చి చెప్పడంతో శిక్షణ పొందిన దరఖాస్తుదారులు జీఎస్టీ వ్యాపారుల కోసం వెతకడం ప్రారంభించారు.

బిల్లుకు రూ.3వేలు కమీషన్ ఇవ్వాల్సిందే..

జీఎస్టీ కొటేషన్ బిల్లు కోసం కొంతమంది దరఖాస్తుదారులు నేరుగా జీఎస్టీ చెల్లిస్తున్న వ్యాపారులను ఆశ్రయిస్తుండగా, మరికొంత మంది దరఖాస్తుదారులు మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. అయితే వచ్చిందే అదునుగా భావించిన జీఎస్టీ చెల్లిస్తున్న వ్యాపారులు రూ.లక్ష బిల్ కొటేషన్ ఇవ్వడానికి రూ.3నుంచి రూ.5వేల వరకు కమీషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొంతమంది వద్ద మొట్టమొదటే నగదు తీసుకొని బిల్లులు ఇస్తుండగా, మరికొంత మంది రుణం మంజూరు అయిన తర్వాతే కమీషన్ ఇవ్వొచ్చు అని ఆయా దరఖాస్తుదారులకు చెబుతున్నారు. జీఎస్టీ కొటేషన్ బిల్లు ఇచ్చిన వ్యాపారుల ఖాతాలోనే ఆ నగదు జమవుతుండటంతో దరఖాస్తుదారులకు రుణం మంజూరు అయిన తర్వాతే ఇవ్వొచ్చు అని చెబుతున్నారు. మొత్తంగా పీఎం విశ్వకర్మ పథకం, బ్యాంకర్లు పెట్టిన నిబంధనలు వీరికి కాసులు కురిపిస్తున్నాయి. ఈ విషయమై ఓ బ్యాంకు అధికారిని వివరణ కోరగా.. కొటేషన్ బిల్లు ప్రస్తుతానికి ఏమీ అవసరం లేదని చెప్పారు.

శిక్షణ కూడా అంతంత మాత్రమే

చేతివృత్తిదారులకు మరింత నైపుణ్యం పెంచేందుకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేశారు. కానీ కొన్ని శిక్షణ కేంద్రాల్లో వృత్తిపై ఏ మాత్రం అవగాహన లేని వారిని నియమించి వారితో నామమాత్ర శిక్షణ ఇప్పించడంపట్ల పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. వృత్తిపై శిక్షకులకే అవగాహన లేకుండా తమకు ఎలా శిక్షణ ఇస్తారని కొంతమంది దరఖాస్తుదారులు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని పలువురు దరఖాస్తుదారులు ఆరోపణలు చేస్తున్నారు.

పత్తిపంట ఎర్రబారుతోంది

● ఇటీవలి వర్షాలతో మునిగిన పత్తిచేలు ● జాలువారుతున్న మొక్కలు ● పెరుగుతున్న కూలీల ఖర్చులు ● ఆందోళనలో రైతులు



సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 13: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపంట ఎర్రబారుతోంది. ఇప్పటికే పత్తిచేలు ఆరకపోవడంతో జాలువారుతున్నాయి. ఆకులకు తెగుళ్లు సోకి ఎర్రరంగుగా మారుతున్నాయి. ముఖ్యంగా పంట చేలో వర్షం నీరు నిలిచి తడి ఆరకపోవడంతో మొక్కలు వాడిపోయేలా మారాయి. జిల్లాలో పత్తిపంట 89,230 ఎకరాల్లో సాగవుతోంది. జిల్లాలో ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపడుతుండడంతో పత్తిసాగు ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. సీజన్ ప్రారంభంలోనే పత్తిసాగు చేయగా ఎండల తీవ్రతతో కొంత నష్టంజరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి పంటకు మరింతగా నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా మొక్కలు ఎదిగే దశలో వర్షం పడి వరదనీరు చేలో నిలవడంతో మొక్కలు ఎదగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు మొక్క ఎదుగుదలలేక దిగుబడి రాదని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

2.83లక్షల ఎకరాల్లో సాగు

ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తం వానాకాలంలో 2,83,757 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో వరి 1,97,669 ఎకరాలు, పత్తి 77,794 ఎకరాల్లో, కంది 1,410 ఎకరాల్లో, మిర్చి 4,073 ఎకరాల్లో, పెసర 2,403 ఎకరాల్లో, వేరుశనగ 251 ఎకరాల్లో, ఇతర పంటలు 157 ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మొత్తం 30,000 ఎకరాల్లో నష్టం జరిగింది. వరి 23 వేల ఎకరాల్లో, పత్తి 6000 ఎకరాల్లో, పెసర 300 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా మిరప 300 ఎకరాల్లో, మామిడి 60 ఎకరాల్లో కందిపంట 38 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో పంటలకు అధిక నష్టం జరిగింది. నడిగూడెం మండలంలో సాగర్ ఎడమ కాల్వకు గండిపడడంతో వరద నీరు పంటలను ముంచేసింది. అంతేకాకుండా ఇసుక మేటలు పొలాల్లో చేరి మరో సీజన్ వరకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు.

కలుపు తీసే అవకాశం లేకుండా పోయింది

పత్తి చేను సాగు చేసిన 10 రోజుల నుంచి పత్తి చేను మధ్యలో ఎలాంటి కలుపుపెరగకుండా దుక్కిని చదును చేస్తుంటారు. అంతేకాకుండా కూలీలతో కలుపు, ఇతర పిచ్చి మొక్కలను తొలగిస్తుంటారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంట చేలో ఎలాంటి పనులు చేయకుండా అవుతోంది. కనీసం ఒకటికి రెండు సార్లు మందులు పిచికారీ చేయాల్సి ఉండగా, ఆ దిశగా రైతులు చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. దీంతో కలుపు పెరిగిపోతుంది. అంతేకాకుండా పత్తిచేలో వర్షం నీరు ఉండడంతో ఆకురంగు పసుపురంగులోకి మారుతోంది. అదేవిధంగా మొక్క వేళ్ల సైతం కుళ్లిపోయే ప్రమాదం ఉంది. మొక్కను బలంలేక దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే కలుపును మొదటి నుంచి తొలగించుకుంటూ పోతే అంతగా ఖర్చు రాకుండా తగ్గుతుంది. కానీ కురుస్తున్న వర్షాలతో కలుపు సైతం అధికంగా పెరగడంతో కూలీలు పెంచాల్సి వస్తుంది. దీంతో ఖర్చులు పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

పత్తిపంటకు నష్టం వాటిల్లింది



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపంట నీట మునిగింది. ఆకులు ఎర్రగా మారాయి. కలుపు సైతం విపరీతంగా పెరిగింది. కూలీల ఖర్చు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఎకరానికి రూ.15వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

సోమిరెడ్డి లింగారెడ్డి, ఆత్మకూర్(ఎస్)

పంట నష్టం అంచనా వేస్తున్నాం

వర్షంతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం. పంటలో జాలు పట్టింది. నీటిని తొలగించేలా రైతులు ప్రయత్నించాలి. 33శాతం పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించే అవకాశం ఉంది. పత్తి, మిర్చి, పెసర పంటలకు అధికంగా నష్టం వాటిల్లింది.

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్‌సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలతో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.12,48,294 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవోఏ. భాస్కర్‌రావు తెలిపారు.

వందేభారత్‌కు మిర్యాలగూడ హాల్ట్ కొనసాగింపు

● నేటి నుంచి అమల్లోకి: దక్షిణమధ్యరైల్వే

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-తిరుపతి మార్గంలో నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు మిర్యాలగూడలో హాల్ట్‌ను కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే ప్రకటించింది. గతంలో ఇచ్చిన తాత్కాలిక హాల్ట్ ఉత్తర్వులు శుక్రవారంతో ముగియగా, తాజాగా జారీచేసిన కొనసాగింపు ఉత్తర్వులు శనివారం నుంచి అమలవుతాయని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. అలాగే, సికింద్రాబాద్-రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కు సిరిపురంలో, రేపల్లె-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు రామన్నపేటలో గతంలో ఇచ్చిన హాల్ట్ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

వరద బాధితులకు రూ.5కోట్ల విరాళం



సీఎం రేవంత్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న వి.నారాయణ

నల్లగొండ, సెప్టెంబరు 13: వరద బాధితులను ఆదుకునేందుకు రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.నారాయణ రూ.5కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ సహాయ కార్యక్రమాల కోసం ఔదార్యం చాటుకున్న రెడ్డీస్ ల్యాబ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి ఉన్నారు.

బుద్ధవనం ఓ వారసత్వ ప్రదర్శనశాల

● శ్రీరామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీ కమలేష్ పటేల్



బౌద్ధ శిల్పాలను పరిశీలిస్తున్న కమలేష్ పటేల్

నాగార్జున సాగర్, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ఓ బౌద్ధ వారసత్వ ప్రదర్శనశాల అని శ్రీరామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీ కమలేష్ పటేల్ అన్నారు. ప్రపంచ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన సాగర్ పైలాన్‌కాలనీలో శ్రీరామచంద్ర మిషన్‌ను సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సభ్యులనుద్దేశించి మాట్లాడిన అనంతరం బుద్ధవనం ప్రత్యేకాధికారి, పర్యాటక శాఖ ఎండీ ఎస్.ప్రకాష్‌రెడ్డి ఆహ్వానం మేరకు సాయంత్రం బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బుద్ధవనంలో మహాస్థూపం, స్థూపవనం, జాతక వనం, చరిత వనాలను తిలకించారు. మహాస్థూపం లోపల ఉన్న బుద్ధుడి ధాతువును చూశారు. శ్రీలంకదేశం బహూకరించిన 27 అడుగుల అవకన బుద్ధ విగ్రహాన్ని పరిశీలించారు. బుద్ధవనంలో ఉన్న మహాస్థూపంపై బౌద్ధ శిల్పాలను గురించి బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా దాజీ కమలేష్ పటేల్ మాట్లాడుతూ 1700 సంవత్సరాల నాటి బౌద్ధ చరిత్ర, వారసత్వాన్ని నేటి తరానికి వివరించేందుకు కళ్లకు కట్టినట్లు బుద్ధవనంలో నిర్మించారన్నారు. బౌద్ధ వారసత్వ విలువలను ఈతరానికి అందిచాలనే ఉద్దేశంతో బుద్ధవనాన్ని నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఆయనవెంట ఎండీ ప్రకాష్‌రెడ్డి, జెన్కో సీఎండీ రోనాల్డ్ రాస్, ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ విసాలాక్షి, సేద్యపునీటి వనరుల మాజీ ఛైర్మన్ ప్రకాష్, బయోజన్ కేర్ డైరెక్టర్ పార్థసారధి, బుద్ధవనం ఓఎస్డీ సూధన్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, బుద్ధవనం శిల్పి శ్యాంసుందర్ ఉన్నారు.

ఈ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనం నిషేధం

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పుట్టంగండిలో గణేష్ నిమజ్జనాలను నిషేధించినట్లు కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్‌గౌడ్, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు. శుక్రవారం అజ్మాపురం పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పుట్టంగండిలోని నీటిని హైదరాబాద్ జంటనగరాలకు, మిషన్ భగీరథకు తాగునీటికి వాడుతున్నందున నీటి కలుషితం కాకుండా ఆయా ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు ఘనపురం బ్రిడ్జి వద్ద, అజ్మాపురం పుష్కర ఘాట్ వద్ద భారీ క్రేన్‌లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సాగర్ కొత్త వంతెన వద్ద కూడా..

నాగార్జునసాగర్: సాగర్ పైలాన్ కాలనీలో కొత్త వంతెన వద్ద భద్రతా కారణాల దృష్ట్యా వినాయక విగ్రహాల నిమజ్జనం నిషేధించినట్లు సాగర్ ఎస్ఐ సంపత్ తెలిపారు. నిమజ్జనాలు హిల్‌కాలనీ సమీపంలో దయ్యాలగండి వద్ద సమ్మక్క-సారక్క పుష్కర ఘాట్ వద్ద మాత్రమే చేయాలని సూచించారు.

అంతర్రాష్ట్ర ద్విచక్రవాహన దొంగ అరెస్ట్

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 13: అంతర్రాష్ట్ర బైక్ దొంగను కొండమల్లేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి శుక్రవారం తెలిపారు. ఈ నెల 3,4 తేదీల్లో కొండమల్లేపల్లి పట్టణంలోని ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసిన రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. శుక్రవారం పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు వద్ద చోరీలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల ప్రాంతానికి చెందిన కోట చిన్నరాజును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

కోళ్లఫాం నుంచి దుర్వాసన రాకుండా చర్యలు

దేవరకొండ, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ ఆదర్శ పాఠశాల సమీపంలో కోళ్లఫాంనుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో నీలిమ తెలిపారు. శుక్రవారం వారు పాఠశాలను పరిశీలించారు. కోళ్లఫాం వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు ఈ నెల 12న ప్రార్థన అనంతరం ఇళ్లకు వెళ్లిపోగా, విద్యార్థి సంఘాలు ధర్నా నిర్వహించాయి. విషయం తెలుసుకున్న ఆర్డీవో, డీఎస్పీ శుక్రవారం పాఠశాలకు చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోళ్లఫారం నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కోళ్ల ఫాంను తొలగించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు ఆర్డీవో శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు.

వరంగల్ రీజియన్‌కు రూ.705 కోట్ల ఆదాయం

● రీజినల్ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 13: మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 110 ఏఎంసీల ద్వారా రూ.705 కోట్ల ఆదాయం వచ్చిందని రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి. శ్రీనివాస్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. వరంగల్ రీజియన్ పరిధిలో 14 రైతు బజారులున్నాయని తెలిపారు. గత సంవత్సరం నిర్దేశించిన వార్షికాదాయం రూ.438కోట్లను అధిగమించామని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో వార్షిక ఆదాయ లక్ష్యం రూ.448 కోట్లుగా నిర్ణయించామని తెలిపారు. ఈ లక్ష్యాన్ని అధిగమిస్తామన్న నమ్మకం తమకు ఉందన్నారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉమ్మడి నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలు వస్తాయని, కొత్త వాటిని పరిగణలోకి తీసుకుంటే 17జిల్లాలు ఉంటాయన్నారు. 1046 మంది సిబ్బందికి కేవలం 351 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. వచ్చే నెల నుంచి ప్రారంభంకానున్న పత్తి కొనుగోళ్లకు సంబంధించి రీజియన్‌లో 233 జిన్నింగ్ మిల్లులుండగా, అందులో ఇప్పటివరకు 205 మిల్లులను పరిశీలించి, గుర్తించామని తెలిపారు.

చౌటుప్పల్ ఏఎంసీ ఆదాయానికి అద్దెలు దోహదం

చౌటుప్పల్ వ్యవసాయమార్కెట్ కమిటీ ఆదాయాన్ని పెంచుకునేందుకు వ్యాపార మడిగెల అద్దెలు దోహదం చేస్తాయని శ్రీనివాస్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఏఎంసీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 13 మడిగెల అద్దె ఖరారు కోసం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాటలో 13 మడిగెలకు నెలకు రూ.1,46,100 అద్దె ఖరారైనట్లు చెప్పారు. మడిగెలను పొందిన వ్యాపారులు ఐదు రోజుల్లో ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఏఎంసీ పర్సన్ ఇన్‌చార్జి పద్మావతి, డీఎంవో సబిత, డీఈ అశోక్, ఏఎంసీ సెక్రటరీ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

నలుగురి ప్రాణాలు తీసిన అతివేగం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం అతివేగం కారణంగా నాలుగు ప్రాణాలు గాల్లో కలిశాయి. పీఏపల్లి మండలంలో ఇద్దరు, పెద్దవూర, కనగల్‌లో ఇద్దరు దుర్మరణం చెందగా.. శాలిగౌరారంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరొకరు మృతి చెందారు.



కనగల్ మండలంలో ప్రమాదంలో దెబ్బతిన్న ట్రాక్టర్, ఘటనాస్థలిలో క్షతగాత్రుడు, పెద్దవూర, పీఏపల్లిలో మృత్యువాతపడిన వెంకటేశ్వర్లు, ధనయ్య(ఫైల్)


పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 13: ఆర్టీసీ బస్సు, బైక్‌కు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని చిలకమర్రి స్టేజీ సమీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. గుడిపల్లి ఎస్ఐ డి.నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొరుగు ధనయ్య(59), దేవరోనితండకు చెందిన ఇస్లావత్ తారు(55) కొండమల్లేపల్లి సమీపంలోని సాయిలక్ష్మి రైస్‌మిల్లులో గుమస్తా, దినసరి కూలీగా పనిచేస్తున్నారు. శుక్రవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని చిలకమర్రి స్టేజీ సమీపంలోని గోదాంకు ధాన్యం బస్తాల లోడ్ పని మీద వచ్చారు. పని ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తుండగా చిలకమర్రి స్టేజీ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద యూటర్న్ అయ్యే క్రమంలో వెనుక నుంచి వస్తున్న దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇస్లావత్ తారు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన ధనయ్యను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందారు. ఇద్దరి మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్ఐ తెలిపారు.

పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని బెట్టలతండా సమీపంలో గల సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పెద్దవూర ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికల్ గ్రామానికి చెందిన చెన్నబోయిన వెంకటేశ్వర్లు (35) తన భార్య ప్రేమలతతో కలిసి ఆస్పత్రి పని మీద నెల్లికల్ నుంచి వారి అత్తగారి ఊరైన తుమ్మచెట్టు ఎక్స్‌రోడ్డు వద్దకు బయలుదేరారు. తుమ్మచెట్టు వైపు వస్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మహేంద్ర జీపు డ్రైవర్ కొప్పుల కార్తీక్ అతివేగంగా వాహనాన్ని నడుపుతూ వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వెంకటేశ్వర్లు, అతని భార్య ప్రేమలతకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్సకోసం హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తుండగా వెంకటేశ్వర్లు మృతిచెందారు. అతని భార్య ప్రేమలత పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వెంకటేశ్వర్లు పెద్దవూర మండలం పర్వేదులలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు తమ్ముడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ..

కనగల్: లారీడ్రైవర్ అజాగ్రత్త.. అతివేగం ఓ ప్రాణాన్ని బలిగొనగా... మరొకరి పరిస్థితి విషమంగా మారింది. నల్లగొండ జిల్లా కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం కుమ్మరికుంట కాల్వ గ్రామానికి చెందిన గోగు లింగమ్మ(69) ఉదయం వడ్లు పట్టించుకునేందుకు గ్రామానికి చెందిన డ్రైవర్ కన్నెబోయిన కొండల్‌ను కిరాయికి మాట్లాడుకుని ట్రాక్టర్‌లో ఎస్.లింగోటం స్టేజీ వద్ద గల రైస్‌మిల్లుకు వచ్చారు. ధాన్యం పట్టించిన తర్వాత బియ్యం బస్తాలను ట్రాక్టర్‌లో వేసుకుని తిరిగి గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో మండలంలోని బాబాసాయిగూడెం స్టేజీ వద్ద నల్లగొండ-హాలియా ప్రధాన రహదారిపై నల్లగొండ నుంచి హాలియా వైపు అతివేగంగా వస్తున్న లారీ వీరి ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ ధ్వంసం కాగా, అందులో కూర్చున్న లింగమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాక్టర్ డ్రైవర్ కొండల్ తలకు గాయాలు కావడంతో, పరిస్థితి విషమించగా చికిత్స కోసం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు గోగు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం లింగమ్మ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో..



శాలిగౌరారం: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఒకరు మృతి చెందారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్ర భిక్షం(44) బుధవారం ఉదయం పొలం పనులకు వెళ్లి వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు 108లో సూర్యాపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాలు, చెయ్యి పడిపోయిందని వెంటనే హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేయగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని వైద్యులు నిర్ధారించారని, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. భిక్షంకు భార్యతోపాటు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గంజాయి నిర్మూలనలో భాగస్వాములు కావాలి



మునుగోడులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, నేతలు

మునుగోడు, సెప్టెంబరు 13 : గంజాయి నిర్మూలనలో యువత భాగస్వాములు కావాలని చండూరు సీఐ వెంకటయ్య పిలుపునిచ్చారు. గంజాయి మహమ్మారి నిర్మూలించాలని, బెల్ట్‌షాపులను నిర్వహించవద్దంటూ కోరుతూ శుక్రవారం మునుగోడులో పోలీస్‌శాఖ, కాంగ్రెస్, అంబేడ్కర్ యువజన సంఘం సంయుక్తంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐతో పాటు పలువురు నేతలు మాట్లాడారు. సమాజమనుగడ కోసం యువత నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పోలగోని సత్యం, కర్నాటి స్వామి, ఏఎంసీ వైఎస్ చైర్మన్ జాజుల అంజయ్య, ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్‌ఎం కే రవీందర్, ఏఎస్ఐ అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, నాయకులు ముచ్చపోతుల శ్రీనివాస్, బీమనపల్లి సైదులు, ప్రతాప్, రాజారాం, ప్రణయ్, జంగిలి నాగరాజు, ఆరేళ్ల సైదులు, బీసం విజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం కృష్ణయ్య నిస్వార్థ ఉద్యమం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న జనార్దన్‌గౌడ్

రామగిరి, సెప్టెంబరు 13: చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ దక్కడం కోసం ఆర్ కృష్ణయ్య నిస్వార్థంతో ఉద్యమం చేస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ అన్నారు. ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే వ్యక్తి ఆర్ కృష్ణయ్య అన్నారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, యువజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, వివిధ మండలాల నాయకులు యాదగిరియాదవ్, కొంపల్లి రామన్న, సతీష్, రాజు, అఖిల్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



యాద్గార్‌పల్లిలో ప్రసంగిస్తున్న బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ రూరల్/ డిండి, సెప్టెంబరు 13 : హక్కుల సాధన కోసం ప్రజలు అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అనేక పోరాటాలు చేసి 10లక్షల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర సీపీఐది అని అన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య పోరాటంగా వక్రీకరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎండీ సయీద్, ధీరావత్ లింగానాయక్, రామలింగం, దుర్గమ్మ, షమీం, మట్టయ్య, కోటయ్య, మల్లమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.

● డిండి మండలకేంద్రంతో పాటు కందుకూరు గ్రామంలో సీపీఐ నాయకులు వారోత్సవాలను నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, బుచ్చిరెడ్డి, ఎస్ఆర్.కనకచారి, మొహినోద్దీన్, పల్లె నర్సింహ, పల్లె శైలేజ్, తిప్పర్తి విజేందర్‌రెడ్డి, పల్లా రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నవీన్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేయాలి

చింతపల్లి : డిండి, నక్కలగండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణసాయుధ పోరాట అమరులకు ఈ నెల 16న ఘనంగా నివాళులర్పించాలన్నారు. సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అమరుల ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఉజ్జిని యుగంధర్‌రావు, బుచ్చయ్య, శేఖరాచారి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



వేములపల్లి, సెప్టెంబరు 13: క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని రావులపెంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రావులపెంట గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మహేష్(26) తల్లి సైదమ్మ, తమ్ముడు జానకిరాములుతో కలిసి ఉంటూ గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈనెల 3న గ్రామానికి చెందిన ఉత్తెర్ల వెంకన్న తన వారితో ఇసుక పనికి రాకుండా వేరే వారితో పనికి ఎలా వెళ్తున్నావంటూ దుర్భాషలాడారు. భారీ మొత్తంలో పెద్దమనుషులతో దండగ వేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపంతో భయాందోళనకు గురై ఈ నెల 5న క్రిమిసంహారక తాగి మహేష్ ఆత్మహత్యాయత్నం చేశాడు. మహేష్ తమ్ముడు జానకిరాములు గుర్తించి అక్క నాగలక్ష్మీకి సమాచారం అందించగా చేరుకున్న వారు అతడిని సూర్యాపేటలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మృతుడి సోదరి తోకల నాగలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

CLASSIFIEDS

WANTED

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పేషెంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 25K. క్వాలిఫికేషన్ : ఏదీ డిగ్రీ. ఫోన్ : 8977547749 AJH002655

WANTED

★ Wanted Teachers Physical science, Primary maths. Contact number +919985464682 +919246373831

AJY_

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9985410384

ఏచూరి మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు







నల్లగొండ, మిర్యాలగూడ, నార్కట్‌పల్లిలో సీపీఎం నాయకుడు ఏచూరికి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ నాయకులు తుమ్మల పద్మ, సయ్యద్ హాషమ్, శంకరయ్య, బీఎం నాయుడు, మంద రాజు, శ్రీరామోజు వెంకటేశ్వర్లు

నల్లగొండరూరల్, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ హాషమ్, జిల్లా కమిటీ సభ్యురాలు తుమ్మల పద్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీకాలనీలో ఏచూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంతుల శంకరయ్య, కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, నరేష్, మధు, జయశ్రీ, కార్తీక్, సునీత, గణేష్, నరేందర్ పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నల్లగొండ మండల కార్యదర్శి నలపరాజు సైదులు, తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం భిక్షం, సత్యనారయణ, రవీందర్, అంజయ్య, రవీందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని వెలిమినేడు, నేరేడ గ్రామాల్లో ఏచూరికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, మల్లం మహేష్, అవిశెట్టి శంకరయ్య, నెలికంటి నర్సింహ, అరూరి శంభయ్య, పంది నరేష్, నాతి వెంకట్రామయ్య, నర్సింహ, కుమారస్వామి పాల్గొన్నారు.

మిర్యాలగూడ: అంబేడ్కర్‌చౌరస్తా వద్ద మిర్యాలగూడ బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎం నాయుడు, మంద రాజు, పాశం గోవర్ధన్‌రెడ్డి, ధనుంజయనాయుడు, బాబు, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

వేములపల్లి: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రొండి శ్రీనివాస్, పాల్వాయి రాంరెడ్డి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని, మాజీ ఎంపీటీసీ చల్లబొట్ల చైతన్య, ప్రణీత్‌రెడ్డి, సైదులు, సైదులు, విష్ణుమూర్తి, వెంకటేశం, వీరయ్య పాల్గొన్నారు.

హాలియా: హాలియాలో ఏచూరికి ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అవుతా సైదులు, రేవల్లి వెంకటేశం, ఐద్వా జిల్లా నాయకులు ధనమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అకారపు నరేష్, కోరే రమేష్, సాయి, చందు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సంతాప కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య, నాయకులు బిజిలి లింగయ్య, ఓడపల్లి యాదగిరి, నల్ల శ్రీను, నల్ల సైదులు ఉన్నారు. బ్రాహ్మణ సంఘం నేతలు సీతారాం ఏచూరికి మృతికి ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. సంఘంనియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్‌శర్మ, నియోజకవర్గ కన్వీనర్ కుర్మేటి వంశీకృష్ణ, వైద్యుల కృష్ణమూర్తి శర్మ సంతాపం ప్రకటించిన వారిలో ఉన్నారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లిలో సీపీఎం నేతలు బస్టాండ్ ఆవరణలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, చెర్కు పెద్దులు, చింతపల్లి బయ్యన్న, గాలి నర్సింహ, అర్థం శ్రీనివాస్, మహ్మద్ అలి, మిర్యాల రాములు, నరేశ్ తదితరులు ఉన్నారు.

కట్టంగూరు: మండలకేంద్రంలో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, దండెంపల్లి నర్సింహ, ముస్కు నర్సింహ, ఎన్నమల్ల ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

శాలిగౌరారం: మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరికి నివాళులర్పించారు.కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి చలకాని మల్లయ్య, సీనియర్ నాయకులు సిరిపంగి రాములు, డెంకల లింగయ్య, మక్కబుచ్చి రాములు, కల్లూరి లింగయ్య, బల్లెం ముత్తయ్య, తేలుకుంట్ల జగన్, సైదుల శ్రీనివాస్, కల్లూరి అంజయ్య, బల్లెం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మర్రిగూడలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సహాయకార్యదర్శి నీలకంఠ రాములు, కొట్టం యాదయ్య, సత్తయ్య, ముత్యాలు, దామెర లక్ష్మి, గిరి, విష్ణు నివాళులర్పించారు.

గట్టుప్పల్ : మండల కేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కర్నాటి సుధాకర్, ఖమ్మం రాములు, కుకునూరు నగేష్, కర్నాటి వెంకటేశం, కర్నాటి యాదయ్య, ముసుకు బుచ్చిరెడ్డి, నరసింహ, గాలయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

మునుగోడు: మండలకేంద్రంలోని చౌరస్తాలో వామపక్షాల ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. సీపీఎం జెండాను అవనతం చేసి జోహార్లు అర్పించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో సురగి చలమతి, మిర్యాల భరత్‌కుమార్, వరకుప్పల ముత్యాలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



రంగుండ్లలో అన్నదానం చేస్తున్న ఏఎస్పీ రాములునాయక్



దేవరకొండ రామాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 13 : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అడిషనల్ ఎస్పీ బాదావత్ రాములునాయక్ అన్నారు. శుక్రవారం రంగుండ్ల తండాలో భగవాన్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, ఎస్ఐ శ్రీనునాయక్, ధరావత్ సూరా, ధరావత్ నాగులు పాల్గొన్నారు.

దేవరకొండ: పట్టణంలోని పెద్దరామాలయం, అయ్యప్పనగర్, రామాలయంలోని గణేష్ విగ్రహం ఎదుట కుంకుమార్చన, గణపతి పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పగిడిమర్రి రఘురాములు, నీల రవికుమార్ పాల్గొన్నారు.

కట్టంగూరు: యువత దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరులోని ఆయా కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయకుల వద్ద ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, మిట్టపల్లి శివశంకర్, రామకృష్ణ, అంజన్‌కుమార్, శశి పాల్గొన్నారు.

శాలిగౌరారం: పెర్కకొండారంలో శ్రీరామయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద విగ్రహ దాత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శానాల యుగంధర్‌రెడ్డి, అన్న ప్రసాదం దాత నూక శైలేష్, కమిటీ సభ్యులు పూజలో పాల్గొన్నారు.

హాలియా: పట్టణంలోని ఒకటవ వార్డులో మునిసిపల్ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు, కాంగ్రెస్ జిల్లా నాయకులు యడవల్లి నరేందర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వెంకటయ్య, సైదులు, గోవిందు,మహేష్, సాయికుమార్, చినాల రవి, పేరూరి కోటయ్య పాల్గొన్నారు. అదేవిధంగా సాయిప్రతాప్‌నగర్‌లో కుంకుమ పూజలు నిర్వహించారు.

వేములపల్లి : మండల కేంద్రంలోని ఎస్ఎస్సీ కాలనీలో శివ సాయి బేకరి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో తోట అశోక్ జ్యోతి, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడులో గరుడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని సీఐ వెంకటయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ముచ్చపోతుల శ్రీనివాస్, గీతమ్మ దంపతులు అన్నదాన నిర్వహించారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో సాయినగర్‌లో వినాయకుడి విగ్రహాల వద్ద కుంకుమ పూజ, పాదసేవలకు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తిరునగరు నాగలక్ష్మీభార్గవ్ హాజరయ్యారు. పలు చోట్ల అన్నదానం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో గంధం లీలారాణి, చిన్ను సునీత, సోమా ధనమ్మ, శ్రీపతి స్వప్న, పద్మ, శ్రీదేవి, సంధ్య, రమ్య, లత పాల్గొన్నారు. శాంతినగర్‌లో గుంటూరు పద్మావతి ఆధ్వర్యంలో మహాయజ్ఞం నిర్వహించారు.

రామగిరి : నల్లగొండ పట్టణంలోని పలు కాలనీలో ఏర్పాటుచేసిన మండపాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. శాంతినగర్, కూరోల్లబావి దగ్గర మహిళలు పెద్దఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు సువర్ణ, విజయ, రిషిత, సునీత, పద్మ, మాధవి, సుమ, మమత ఉన్నారు.



మిర్యాలగూడలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు



మాడ్గులపల్లి : మండల కేంద్రంలోని రైతువేదికలో ఎరువుల దుకాణదారులతో ఏడీఏ దేవ్‌సింగ్ సమావేశమయ్యారు. నకిలీలు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, ఫర్టిలైజర్ దుకాణదారులు పాల్గొన్నారు.

మునుగోడు: బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్న మద్యం దుకాణదా రులను గుర్తించి వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కట్ట లింగస్వామి కోరారు. ఈమేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట సమాఖ్య డివిజన్ కమిటీ సభ్యులు యాట రాజు, బిక్షం, మహేష్, గిరి ఉన్నారు.

నకిరేకల్ : మండలంలో సభ్యత్వ నమోదును అధికంగా చేయించాలని బీజేపీ జిల్లా నాయకుడు నకిరేకంటి మొగిలయ్య అన్నారు. తాటికల్ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మండల వెంకన్న, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, నడికుడి సైదులు, కొండేటి శ్రీను పాల్గొన్నారు.

మాడ్గులపల్లి : ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి టీఎస్‌యుటీఎఫ్ సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్యామ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : పితృవియోగం పొందిన బీఆర్ఎస్ రైతువిభాగం మండల అధ్యక్షుడు బత్తిని రమేశ్‌ను పలువురు పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, పనసం మణెమ్మ, పుల్లెంల ముత్తయ్య, అచ్చాలు, దాసరి రాజు, కొల్లు రాంరెడ్డి, బండ సాగర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి ఉన్నారు.

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కె)లో భాగంగా వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదావత్ లచ్చిరాం, టీచర్లు మంజులత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేములపల్లి : మండలంలోని రావులపెంట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వారోత్సవాఉల నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరిమి రజిని, హెచ్‌ఎం లక్ష్మణ్‌నాయక్, టీచర్లు జగన్మోహన్, చైతన్య, నిర్మల, వసుంధర, ఏఎన్‌ఎం నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు వెంకటరమణ, శారద, విజయ, ఆశాలు పద్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మాచినపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, టీచర్ పద్మ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్ : ఆరెగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శారద, హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు, సునీత, శ్రీనివాస్, చంద్రకళ, నవనీత, కవిత, జ్యోతి, ముత్తమ్మ, గర్భిణులు, బాలింతలు ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని వేంకటేశ్వరనగర్‌లో పోషణ అభియాన్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యధికారి వంశీకృష్ణ, సూపర్‌వైజర్ సుగుణ, టీచర్లు బాదేపల్లి స్వప్న, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కనగల్: విద్యార్థుల్లో క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో తరి రాములు అన్నారు.కనగల్ హైస్కూల్‌లో క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. అండర్-14 అండర్-17 విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, ఏపీపీ అధ్యక్షురాలు ధనమ్మ, పీడీ నర్సిరెడ్డి, కవిత, సుధాకర్ రాజు, సీఆర్‌పీలు సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కట్టంగూరు : మండల ఇన్‌చార్జి ఎంపీవోగా ప్రస్తుత కార్యాలయ సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను జ్ఞానప్రకాశ్‌రావు, కార్యదర్శులు సన్మానించారు.

దామరచర్ల: మండలంలోని నూనావత్ తండా పరిధిలోని అన్ని గ్రామాలకు, వాత్యాతండా, బొత్తలపాలెం ఫీడర్‌పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అబ్దుల్లా హబీబ్ తెలిపారు.ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శన



మునుగోడులో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

మునుగోడు : మండలంలోని అన్నిగ్రామాల ఓటరు జాబితాలను వార్డుల వారీగా ప్రచురించి ఆయా పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డుపై శుక్రవారం ప్రదర్శించామని ఎంపీడీవో పూజ తెలిపారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆమె వెంట మండల పరిషత్ పర్యవేక్షకుడు విజయ్ భాస్కర్, స్థానిక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

మర్రిగూడ : ఓటరు జాబితాలో సవరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మున్నయ్య కోరారు. ఈ నెల 19వ తేదీ వరకు సవరణ అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితాను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో అతికించామన్నారు.

కనగల్ : ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే కార్యదర్శులకు ఈ నెల 21 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జయరాం సూచించారు. గ్రామపంచాయితీల్లోని నోటీస్‌బోర్డులో అధికారులు ఓటరు జాబితాలను ప్రదర్శించారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి



మండలస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన ఏపీఎం విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, సెప్టెంబరు 13 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఏపీఎం పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులను శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి పాల్గొన్నారు. నకిరేకల్ పట్టణానికి చెందిన కొండ భిక్షమమ్మ, చల్ల వీరయ్యలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.

నార్కట్‌పల్లి : మండలంలోని మాండ్ర శివారులోని అనంత స్వర్ణగిరి మహాలక్ష్మీ, పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయాల చైర్మన్, మాతృవియోగం పొందిన ఉండ్ర లింగారెడ్డిని ఎమ్మెల్యే వేముల వీరేశం నార్కట్‌పల్లిలో పరామర్శించారు. ఆయన తల్లి రాజమ్మ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. లింగారెడ్డిని పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెరిపోతుల భరత్, దాసరి రాజు, గాయం శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 13: బస్టాండు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికుల ఇబ్బంది కలగకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రాత్రి బస్టాండును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైన విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయడంతో పాటు సీసీ కెమెరాలు బిగించాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు సామాగ్రికి తగిన భద్రత కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

17 నుంచి స్వచ్ఛతయే సేవా కార్యక్రమం

రామగిరి, సెప్టెంబరు 13: భారత ప్రభుత్వ ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆదేశాల మేరకు నల్లగొండ డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతయే సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఇన్‌చార్జి, డివిజనల్ మేనేజర్ హీరాసింగ్ రావత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ, కార్యాలయంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం, స్వచ్ఛత పరుగు, వంటి కార్యక్రమాలతో పాటు సఫాయి కార్మికులను గౌరవించడంతో పాటు వారి ఆర్థిక ప్రగతి, సామాజిక భద్రతకు తోడ్పడేలా సంబంధిత శాఖల వారి సమన్వయంతో కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు పెద్దఎత్తున సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కౌన్సిలర్ లక్ష్మమ్మ మృతి



లక్ష్మమ్మ(ఫైల్)

రామగిరి, సెప్టెంబరు 13: నల్లగొండ పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ కంకణాల లక్ష్మమ్మ(60) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం కన్నుమూశారు. ఆమె మృతదేహాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజుయాదవ్, బండారు ప్రసాద్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ ఫైమద్‌తో పాటు సీపీఎం నాయకులు హాషం సలీం, దండెపల్లి సత్తయ్య, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ముందస్తు అదుపులో బీఆర్ఎస్ నాయకులు

డిండి, సెప్టెంబరు 13 : బీఆర్ఎస్ శుక్రవారం సైబరాబాద్ కమిషనరేట్ ముట్టడి నేపథ్యంలో ఆ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచే నాయకులను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. డిండి మండలంలో అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు గిరమోని శ్రీనివాస్, గుర్రం సురేష్, ఎండి.రషీద్, పీర్ మహమ్మద్, లక్ష్మణ్, రామస్వామి ఉన్నారు.

గట్టుప్పల్ : మండలంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడం కైలాసం, మాజీ ఎంపీటీసీ గొరిగె సత్తయ్య, భీమగాని యాదయ్య, మదగాని వెంకటేష్ గౌడ్, మదగాని రామశంకర్, జూలూరి పురుషోత్తం, బీపీఎల్ గౌడ్, కట్ట స్వామి, మలిగే మల్లేష్, ఈశ్వరప్ప, వావిళ్ళ వెంకటేశం, బరిగెలా లింగయ్యలు ఉన్నారు.

కట్టంగూరు : నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ పోగుల నర్సింహ, నాయకులు పెద్ది బాలనర్సింహ, బెల్లి సుధాకర్, పిన్నపురెడ్డి నర్సిరెడ్డి, అంతటి శ్రీను, అంతటి శేఖర్ తదితరులు ఉన్నారు.

హాలియా : హాలియాలో అరెస్టయిన వారిలో హాలియా మునిసిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి ఉన్నారు.

సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 13 : వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచాలని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు నాణ్యత, ప్రమాణాలను పాటించాలన్నారు. మెప్మా పీడీ కరుణాకర్ మాట్లాడుతూ టూల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో దుగ్యాల వేణు, వెంకటేశ్వర్లు, బక్కయ్య, శాలివాహన, శ్యాం, పార్వతి పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 13: బీసీల సమస్యలు పరిష్కరించాలని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్‌లను కోరినట్లు బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇరువురిని హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎంబీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్, బంటు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.